క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి కృషి



వనస్థలిపురంలో రింక్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పలువురిని సన్మానించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వనస్థలిపురంలోని రింక్ గ్రౌండ్‌లో తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇన్‌లైన్ హాకీ డెవలప్‌మెంట్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రింక్ గ్రౌండ్‌లో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. ఈ గ్రౌండ్‌లో ఆడిన క్రీడాకారులు ఇతర దేశాలలో ఆడడానికి ఎంపిక య్యారని అన్నారు. అనంతరం వరల్డ్ స్కేటింగ్ గేమ్స్‌కు ఇండియా జట్టుకు ఎంపికైన హాకీ స్కాటర్స్ నందిత, కావ్య, తేజస్విని, మోహిత్ ప్రణవ్, శ్రీపత్, సాయిచంద్రలను, అసోసియేషన్ అధ్యక్షుడు రాజగోపాల్, కార్యదర్శి రామకృష్ణ, అర్జున అవార్డీ అనూప్, నేషనల్ కోచ్ సత్యం, వనస్థలిపురం రింక్ కోచ్ శ్రీనివాస్, ఇండియన్ టీం కోచ్ నికోలను ఆయన సన్మానించారు.

డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలోని సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని విరాట్‌నగర్‌లో పారిశుద్ధ్య కార్మికులు చేపడుతున్న పారిశుద్ధ్య పనులను కార్పొరేటర్ సుజాతనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు కనీస వసతులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విరాట్‌నగర్ కాలనీలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

ఘనంగా స్వామివారి రథోత్సవం



శ్రీజగన్నాథ స్వామివారిని రథంపై ఊరేగిస్తున్న ఆలయ పాలక మండలి సభ్యులు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ ప్రాంగణంలోని శ్రీజగన్నాథ స్వామివారి రథోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగగా నిర్వహించారు. ముందుగా త్రిదండి శ్రీ భక్తి సౌరభ్ నారాయణ్ మహరాజ్ ఆధ్వర్యంలో జగన్నాథ స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, హారతి, మంత్రపుష్పం వంటి ప్రత్యేక పూజలు వేదపండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, సభ్యులు ఛాతిరి మధుసాగర్, సురేష్‌గౌడ్, తిరుమలేష్, సురేందర్‌రెడ్డి, బబ్బూరి ఆనంద్‌గౌడ్, కిరణ్, ఆలయ అర్చకులు అంబ ప్రసాద్, సంతోష్‌శర్మ, భార్గవ శర్మ పాల్గొన్నారు.

దోమల నివారణకు 25 టీమ్‌లు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తమైన యంత్రాంగం

- రోజూ ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలు
- ప్రతి శుక్రవారం డ్రైడే
- పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన తరగతులు



మూసీనది పరివాహక ప్రాంతాలలో ఎంటమాలజిస్టు సిబ్బంది పిచికారీ

చాదర్‌ఘాట్: వర్షాకాలంలో తరచూ వచ్చే సీజనల్ వ్యాధులపై జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఇందులో భాగంగా వర్షాకాలంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే డెంగీ వ్యాధిపై అవగాహన కలిగిస్తూ మరోవైపు ముందు జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలకు ఉపక్రమించారు. దీనిలో భాగంగానే లార్వా దశలోనే దోమలను నివారిస్తే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని అందుకోసం తమ ఇళ్లలో దోమలు వృద్ధి చెందే ప్రాంతాలపై దృష్టి పెట్టాలని హెచ్చరిస్తున్నారు.

జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్–6 పరిధిలోని అన్ని డివిజన్‌లలో ఎంటమాలజిస్టు సిబ్బంది రోజూ ఇంటింటికి వెళ్లి దోమల నివారణపై ప్రజలను చైతన్యవంతులను చేయడమే కాకుండా అవగాహన కలిగిస్తూ ఎక్కడెక్కడ దోమలు వృద్ధి చెందుతాయో వాటి గురించి తెలియజేస్తున్నారు. వాడి పడేసిన టైర్లు, కుండలు, కొబ్బరి చిప్పలు, డ్రమ్ములు, ట్రేలు, కూలర్లు నీరు నిలువ ఉండే ప్రాంతాలని దోమల ఉత్పత్తికి ఇవే ఆవాసం అవుతాయని తెలియజేస్తున్నారు. డెంగీ వలన జ్వరం, చర్మంపై దద్దుర్లు, తలనొప్పి, కళ్లల్లో మంటలు, కండరాలు, కీళ్ల నొప్పులు ఉంటాయని పేర్కొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

25 టీమ్‌లు...

దోమలను లార్వా దశలోనే నిర్మూలించేందుకు మలక్‌పేట సర్కిల్–6లో 25 యాంటీ లార్వా టీములు ఏర్పాటు చేశారు. వీరు రోజు ఇంటింటికి వెళ్లి నీటి తొట్టిలు, దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను ఎలా అరికట్టాలో చైతన్యాన్ని కలిగిస్తున్నారు.

14 ఫాగింగ్ మిషన్లు...

మలక్‌పేట జోన్ పరిధిలో 14 ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. ప్రతీ వార్డుకు రెండు చొప్పున పని చేస్తున్నాయి. చెరువులు, కుంటలు, మురుగు కాలువాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్నారు. అంతేకాకుండా దోమల వృద్ధి కారణమవుతున్న గుర్రపు డెక్క కూడా తొలగిస్తున్నారు. మనుషులు వెళ్లలేని ఏరియాకు డ్రోన్ల ద్వారా వాటిని తొలగిస్తున్నారు.

మహిళలు ముఖ్య పాత్ర పోషించాలి

ఇళ్లలో దోమలు అభివృద్ధి చెందకుండా ఉండాలన్నా.. వాటిని పూర్తిగా నిర్మూలించాలన్నా అది మహిళల చేతిలోనే ఉంటుందని మలక్‌పేట సర్కిల్–6 జోన్ ఎంటమాలజిస్టు శ్రీనివాస్ తెలిపారు. దోమల నివారణతో పాటు కాలనీవాసులు తగిన సహకారం అందించాలని కోరారు.

– ఏఈ శ్రీనివాస్

మహిళల రక్షణే ధ్యేయం

రాచకొండ సీపీ తరుణ్‌జోషీ

15 రోజుల్లో 125 మంది పోకిరీలను పట్టుకున్న రాచకొండ షీ టీమ్స్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషా విశ్వనాథ్

నాగోలు: బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీ టీమ్స్ పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని, బాలికలను, మహిళలను వెంబడించే వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ వారిని, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారని అన్నారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు మంగళవారం ఎల్బీనగర్‌లోని రాచకొండ సిపి క్యాంపు కార్యాలయంలో షీ టీమ్స్‌కు పట్టుబడిన వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తున్న 125 పట్టుపడగా (మేజర్స్–42, మైనర్స్–83) మందిని షీ టీమ్స్ పట్టుకున్నారు. గత నెల 16 నుంచి 30 వరకు 168 ఫిర్యాదులు అందినాయని రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి. ఉషా విశ్వనాథ్ తెలిపారు. ఫిర్యాదులపై విచారణ చేపట్టి దర్యాప్తు పూర్తి చేశామన్నారు. అందిన ఫిర్యాదులలో ఫోన్ల ద్వారా వేధించినవి –29, సోషల్ మీడియా ద్వారా వేధించినవి– 41, నేరుగా వేధించినవి – 98లు ఉండగా వాటిలో క్రిమినల్ కేసులు–14, పెట్టి కేసులు– 36, మరో 88 మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. రాచకొండ పరిధిలో మహిళలు వేధింపులకు గురైతే వెంటనే రాచకొండ వాట్సాప్ నెంబర్ 8712662111లో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది, కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

సర్కార్ బడులను బలోపేతం చేస్తాం

మలక్‌పేట: సర్కాల్ బడులు బలోపేతం అయ్యే విధంగా చర్యలు చేపడుతున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మంగళశారం ఆయన విద్యాశాఖ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని సర్కార్ బడులలోని సౌకర్యాలు, ఒకే ప్రాంగణంలో ఉన్న పాఠశాలల నిర్వహణపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్కార్ బడులను బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో ఇంకా మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హైద్రాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి, సైదాబాద్ మండల డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ, హిమాయత్‌నగర్ డిప్యూటీ ఈఓ విజయలక్ష్మి, చార్మినార్ డిప్యూటీ ఈఓ నెహ్రూబాబు, డిప్యూటీ ఐఓఎస్, అధికారులు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులతో సమస్యపై చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతి

చైతన్యపురి: డివిజన్‌లోని పలు కాలనీలలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి సరూర్‌నగర్ ఏడీఇ తిరుపతయ్యకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. కాలనీలలో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, కమలానగర్, నేతాజీనగర్, త్యాగరాజనగర్, సరస్వతినగర్, కృష్ణవేణినగర్, మహాలక్ష్మినగర్, వివీనగర్ ప్రాంతాల్లో పాతకాలం నాటి ఇనుప స్తంభాలు దెబ్బతిన్నాయని వివరించారు. వీటి స్థానంలో కొత్త స్తంభాలు వేయాలని కోరారు. అలాగే విద్యుత్ వైర్లు చెట్లు, భవనాల మధ్య ఉండటం వల్ల ఎర్తింగ్, లూజ్ కనెక్షన్ వల్ల విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయని కొత్త కేబుల్ ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను త్వరగా పూర్తయ్యేలా చూడాలని కార్పొరేటర్ కోరారు.



విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఏడీఇకి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్

రక్తదాన శిబిరంలో యువత పాల్గొనాలి

మన్సూరాబాద్: తలసేమియా చిన్నారులను ఆదుకుందామని జై భారత్ జాతీయ కార్యదర్శి సత్యనారాయణ గోల పిలుపునిచ్చారు. ఎల్‌బీనగర్‌లోని జైభారత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జై భారత్ పూర్వ జాతీయ అధ్యక్షుడు ఖదిజ్జాసీ ఆజాద్ షేక్ 7వ వర్ధంతిని పురస్కరించుకుని ఎల్‌బీనగర్ సూర్యోదయ నగర్ కాలనీలోని జై భారత్ కార్యాలయం ఖల్సాభవన్‌లో బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో హాజరై రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9848030089, 9849995538 నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

రహదారి నిర్మాణంపై ఎవరూ ఆందోళన చెందొద్దు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



వినతిపత్రం సమర్పిస్తున్న కాలనీవాసులు

చైతన్యపురి: మూసీ ఆనుకుని నిర్మాణం చేపట్టబోయే రహదారిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్ మూసీ ఆనుకొని ఉన్న మారుతీనగర్, ఫణిగిరి కాలనీ, సత్యనగర్, ఎస్‌వీఎస్‌నగర్ కాలనీల ప్రజలు మంగళవారం ఎమ్మెల్యేను కలిశారు. రహదారి వల్ల తమకు నష్టం కలగకుండా చూడాలని వినతిపత్రం సమర్పించారు. రహదారి బౌండరీస్ గురించి ఎవరూ ఆందోళన పడవద్దని అందరికి న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కాలనీవాసులతో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయుడు, సాగర్, చలపతిరావు, ధనుంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



అమ్మవారి పూజల్లో రవీందర్‌రెడ్డి తదితరులు

సైదాబాద్: ఆషాఢ మాసం వస్తూనే అందరిలో ఆధ్యాత్మికతను పెంచుతుందని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. బల్కంపేట రేణుకా ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ్యాన్ని పురస్కరించుకొని మంగళవారం సైదాబాద్ చేపల మార్కెట్‌లో సైదాబాద్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్ కాటేకర్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి పూజల్లో కార్పొరేటర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, బీజేవైఎం నాయకుడు రమణ్‌సింగ్ పాల్గొన్నారు. అనంత రం సైదాబాద్ ఫ్రెండ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ గావించారు. అసోషియేషన్ ప్రతినిధులు దినేష్ గౌలీకర్, ధర్మేందర్ సింగ్, అవినాష్ నాయుడు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం



అవగాహనా ర్యాలీలో పాల్గొన్న లోటస్ ల్యాబ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

చంపాపేట: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని లోటస్ ల్యాబ్ పాఠశాల చైర్మన్ కడారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం చంపాపేట డివిజన్ సాయిరాంనగర్ కాలనీలోని లోటస్ ల్యాబ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్క వ్యక్తి ఒక మొక్కను విధిగా నాటి సంరక్షించాల్సి బాధ్యత ఉందని గుర్తు చేశారు. అనంతరం మొక్కలు నాటి సంరక్షించటం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుపుతూ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆలోచింపచేశాయి. అనంతరం విద్యార్థులు సాయిరాంనగర్, అంజిరెడ్డినగర్, శిఖరా ఎన్‌క్లేవ్ కాలనీలో వన మహోత్సవ ప్లకార్డులను ప్రదర్శిస్తూ అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శేషఫణి, మేనేజర్ నందికొండ రవీందర్‌రెడ్డి, నాగరాణి, కోఆర్డినేటర్ రాజేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఎదుట విద్యార్థి తండ్రి అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న నిరసన తెలియజేస్తున్న విద్యార్థి తండ్రి

నాగోలు: తన ఇద్దరు పిల్లలకు సంబంధించి బోనో ఫైడ్, టీసీ సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఓ విద్యార్థి తండ్రి పాఠశాల ఎదుట నిరసన తెలియజేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం... హయత్‌నగర్ పరిధిలోని తట్టి అన్నారం వైఎస్ఆర్ కాలనీ చెందిన అన్నం ధర్మారెడ్డి తన ఇద్దరు పిల్లలు యోగేష్‌రెడ్డి, ఈశ్వర్‌లు గతంలో నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడ కృషినగర్‌లోని అక్షర టెక్నో స్కూల్‌లో చేర్పించాడు. అయితే కొన్ని కారణాల వల్ల పిల్లలను వేరే స్కూల్‌లో చేర్పించాడు. అప్పటి నుంచి దాదాపు 6 సంవత్సరాలగా పిల్లల బోనోఫైడ్, టీసీలు ఇవ్వకుండా పాఠశాల యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తుంది. ఈ క్రమంలో మరోసారి పాఠశాలల నిర్వాహకులను సంప్రదించగా పెండింగ్ ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్స్ ఇస్తామని తెలియజేశారు. దీంతో సహనం కోల్పోయిన ధర్మారెడ్డి అక్షర టెక్నో స్కూల్ వద్ద తనకు న్యాయం చేయాలని కోరుతూ బోర్డు పట్టుకుని నినాదాలు చేస్తూ స్కూల్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేశాడు. దీంతో పాఠశాల యాజమాన్యం దిగివచ్చి టీసీ ఇచ్చారు. ఈ విషయంలో విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడంతో ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యం తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రజా సమస్యలను పరిష్కరించడమే నా లక్ష్యం



మాదిగ హిందూ శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కాలనీలలోని ప్రజా సమస్యలను పరిష్కరించటమే నా లక్ష్యమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరభద్రనగర్ కాలనీలోని మాదిగ హిందూ శ్మశానవాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కా ర్పొరేటర్ మాట్లాడుతూ రూ.1.60 లక్షలతో శ్మశానవాటికలో నూతన బోరును, స్నానపు గదుల్లో కులాయిలను మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. శ్మశానవాటికలో పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా చుట్టుపక్కల నివాసితులు శ్మశానవాటికలో చెత్త వేయకుండా ప్రహరీ చుట్టూ మెష్ వేయిస్తానని హామీ ఇచ్చారు. స్నానపు గదులను ఆధునీకరణకు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రహరీ చుట్టూరా మొక్కలు నాటుదా మని సంఘం పెద్దలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బాబురావు, రామస్వామి, పారంద అంజయ్య, హరిబాబు, పారంద రమేష్, ఎర్ర శ్రీరాము లు, రవీందర్, సుధాకర్, సాయి,కుమార్, సతీష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

లింగోజిగూడ డివిజన్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

సమస్యలను జెడ్సీ దృష్టికి తీసుకొచ్చిన కార్పొరేటర్

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ జంక్షన్‌లో ట్రాఫిక్‌ను మరింత మెరుగు పరిచాల్సిన అవసరం ఉందని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్, ఐఏఎస్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని అక్కడ వాల్ టూ వాల్ రోడ్డు వేయాలని సూచించారు. ఎల్‌బీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ద్వారం రహదారికి ఆనుకొని ఉండడం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాల వెనుక వైపు ఉన్న సీఎం రోడ్డులో మరో రెండు గేట్లను ఏర్పాటు చేయడంతో పాటు పిల్లల భద్రత కోసం సీసీ రోడ్డును నిర్మించాలని కోరారు. ఎల్‌బీనగర్ చౌరస్తాకు నాలుగు దిక్కులా ప్రయాణికులకు అనుకూలంగా మరుగు దొడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎల్‌బీనగర్‌లో రూ. 5భోజనం కోసం ఏర్పాటు చేసిన గ్రీల్డ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా ఉందని దానిని తొలగించి రోడ్డు వెడల్పు చేయాలని కోరారు. డివిజన్ పరిధిలో పలు కాలనీలలో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని కూడా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు కార్పొరేటర్ తన దృష్టికి తీసుకొచ్చిన పలు ప్రతి పాదనలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు.ఎల్‌బీనగర్ డీసీ జాకీయా సుల్తానా, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ విజయ్, నాయకులు శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎల్‌బీనగర్ చౌరస్తాలో సమస్యలను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్, కార్పొరేటర్

డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా


చంపాపేట: డివిజన్ పరిధిలోని పలు కాలనీలలోని మౌలిక సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిద్దిటమే నా ప్రధాన లక్ష్యమని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని దుర్గభవానీనగర్, యాదగిరినగర్ కాలనీలలో త్వరలో ఏర్పాటు చేయన్ను సీసీ రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలలో అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు స్థానిక కాలనీవాసులకు కొంతమేర ఇబ్బందులు తలెత్తుతాయని కాలనీ వాసులు సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కా లనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సభ్యులు వెంకట్, కృష్ణ, ప్రభాకర్, నాయకులు శ్రీనివాస్‌నాయుడు, సుమిత్, అరుణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

కమిషనర్‌కు వినతి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలీని మర్యాదపూర్వకంగా తన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ సమస్యలపై ఆమెకు వివరించి వినతిపత్రం అందజేశారు.



కమిషనర్ ఆమ్రపాలీకు వినతి పత్రం అందజేస్తున్న లచ్చిరెడ్డి

అంతర్గత రహదారులను ఆధునికీకరిస్తాం

ఐఎస్ సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారులను సైతం ఆధునీకరిస్తామని కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని గవర్నమెంట్ ప్రెస్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐఎస్ సదన్‌లోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అవి పూర్తయిన తరువాత ఆయా ప్రాంతాలలోనూ రహదారులు నిర్మిస్తామని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం సభ్యులు దేవేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, వెంకటేశ్వరరెడ్డి, జితేందర్‌రెడ్డి, నవీన్‌కుమార్ రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.